

మా మావయ్య అనాథ కాదు

నవర బారికి అనాథ కాదని మేనల్లుడు చెబుతున్నాడు. బారికి మృతిపై రాజకీయం తగదంటున్నాడు.

- 8లో



ఉత్సాహం ఉరకలు

సాక్షి ప్రీమియర్ ప్రాంతీయ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వైజాగ్‌లో పోటీలు జరుగుతున్నాయి.

- 8లో

14న ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 14న ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహించనున్నట్లు ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు గ్రామ పెద్దలు, దేవదాయ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, ఆలయ అర్చకుల సమక్షంలోనే హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనాలు



ప్రవచనాలు చేస్తున్న గరికపాటి

నరసన్నపేట: మండలం గుండవల్లిపేటలో ఉమా స్వయంభేశ్వర స్వామి ఆలయ 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ధర్మకర్త పంచిరెడ్డి విశ్వనాధం(బుజ్జి) ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో గరికపాటి నర్సింహారావు ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. భక్తి భావం, హిందుత్వం, శివ లీలలు, శివుని ఎందుకు పూజించాలి అనే అంశాలపై ఆయన ప్రవచించారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రామలింగన్నాయుడు గ్యాస్ ఏజెన్సీ యజమాని ధర్మాన రామదాసు, వైద్యులు కింజరాపు అమ్మన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు చర్యలు: కలెక్టర్



పాలిటెక్నిక్ కళాశాల సందర్శించిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: మార్చి 16న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను శనివారం జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, భద్రత, ఓటర్లకు సౌకర్యాలు వంటివి పరిశీలించారు. ఆయన వెంట జేసీ నవీన్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి, తహసీల్దార్ కె.వెంకటరావు ఉన్నారు.

మహేంద్రగిరి యాత్రకు ప్రత్యేక బస్సులు

కాశీబుగ్గ: శివరాత్రి నాడు జరిగే మహేంద్ర గిరి యాత్రకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పలాస ఆర్టీసీ కాంప్లెక్సు అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో జరిగే యాత్రకు పలాస డిపో బస్సులు రెండు రోజులు పాటు రాకపోకలు జరుపుతాయని అన్నారు. పలాస–సాబకోట, సోంపేట–సాబకోట, సాబకోట–పాత్తంగి, పాత్తంగి–బారువకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు.

ఆర్‌బీకే ఉద్యోగిని నిర్బంధించిన వారిపై కేసు

మెళియాపుట్టి: ధాన్యం బస్తాలకు ట్రక్ షీట్లు ఇవ్వలేదని బాణాపురం గ్రామ వ్యవసాయ సహాయకుడిని రైతు భరోసా కేంద్రంలోనే నిర్బంధించిన వారిపై మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ నరసింగరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాణాపురం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వీఏఏ నరహరిపురం లోకేశ్వరరావును ట్రక్‌షీట్లు ఇవ్వాలని కొందరు రైతులు అడిగారు. అప్పటికే టార్గెట్ పూర్తయ్యిందని, మండల వ్యవసాయ శాఖ అధికారి దృష్టిలో పెట్టి మళ్లీ ఇండెంట్ తీసుకుంటామని వీఏఏ చెబుతుండగానే.. పెద్దంటి చిన్నారావు, పైల హేమాచలం, పడాల ఉదయ్‌కుమార్, అగ్గాల వినోద్ కుమార్, తెలగ కామేశ్, శ్యామ్‌సుందర్ అనే వ్యక్తులు వీఏఏ లోకేశ్వరరావును శుక్రవారం సాయంత్రం ఆర్‌బీకే లోపల పెట్టి తాళాలు వేశారు. సుమారు గంటన్నర పాటు ఈ గందరగోళం జరిగింది. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో తాళాలు తెరిచారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగితో ఇలా వ్యవహరించడంతో లోకేశ్వరరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నరసింగరావు తెలిపారు.

కలిసుంటేనే కలదు సుఖం..



మాంగల్యం తంతునానేనా.. మమ జీవన హేతునా.. కంఠే బద్నామి శుభగే త్వం జీవ శరదం శతం.. ఈ మంత్రాన్ని అందరూ వందలసార్లు విని ఉంటారు. ఈ మంత్రం వింటూనే వరుడు వధువు మెడలో తాళి కడతాడు. ఈ మాంగల్య ధారణతో మనం తోడూనీడగా వందేళ్లు కలిసి ఉందాం.. అని క్లుప్తంగా దీని అర్థం. వేలాది జంటలు ఈ మంత్రాన్ని అర్థం చేసుకుని బతుకులను పండించుకుంటూ ఉంటే.. కొందరు మాత్రం అపార్థాలకు, అనుమానాలకు పోయి నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సర్దుకుపోతూ కాలాన్ని మధురం చేసుకోవాల్సిన వారు.. అనవసర గొడవలకు పోయి కుటుంబాలకు చేదు మిగుల్చుతున్నారు. సిక్కోలులోనూ ఈ పెడ ధోరణి ప్రబలుతోంది. చాలాజంటలు కోర్టు మెట్లెక్కుతున్నాయి. అయితే ఇలాంటి గొడవలను పరిష్కరించే వేదికలూ ఉన్నాయి. నేడు ప్రపంచ వివాహ దినోత్సవం.



- విచ్ఛిన్నమవుతున్న వివాహ బంధాలు
- అపార్థాలే అనర్థాలకు మూలం
- కౌన్సెలింగ్ ఇస్తూ కాపురాలను నిలబెడుతున్న పోలీసులు
- నేడు ప్రపంచ వివాహ దినోత్సవం





ఇచ్ఛాపురం రూరల్: మూడు ముళ్ల బంధం చాలా మందికి పల్లేరు ముళ్ల చందంలా మారుతోంది. సినిమాల ప్రభావం, పెరుగుతున్న పాశ్చాత్య ధోరణి, మనుషులను అర్థం చేసుకునే తత్వం తగ్గడంతో కాపురాలు కూలిపోతున్నాయి. సిక్కోలు జిల్లా కూడా ఇందుకు మినహాయింపు కాదు. కుల, మతాలకు అతీతంగా చాలా యువ జంటలు అనుమానం అనే కార్చిచ్చుకు బలైపోతున్నాయి. ఒక తరం ముందు వరకు కష్టనష్టాలను కలిసి పంచుకున్న దంపతులు.. తరం మారే సరికి సర్దుకుపోయే తత్వాన్ని మర్చిపోయి మనుషులను దూరం చేసుకుంటున్నారు. చిన్న చిన్న విషయాలకు కూడా పెద్ద గొడవలకు పోయి దాంపత్యాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు.

మనస్పర్థలతో...

పెద్దగా ఆస్తులు, చెప్పుకోదగ్గ ఆదాయ వనరులు, సమాజంలో హోదా, సౌకర్యాలు, సౌఖ్యాలు లేని రోజుల్లో భార్యాభర్తలు హాయిగా అరమరికలు లేకుండా బతికేశారు. కానీ చదువు, ఉద్యోగం, స్థాయి, హోదా అనేవి వచ్చాక ఆలోచనల్లోనూ మార్పు కనిపిస్తోంది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్న చిన్న మనస్పర్థలు, అనుమానాలు కలతలు సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడూనీడగా కలిసి నడవాల్సిన ఆలుమగలు మధ్య విభేదాలు వేరే కుంపటికి దారి తీస్తున్నాయి. లేనిపోని అనుమానాలతో దంపతులు ఠాణా మెట్లెక్కుతుండటంతో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ చాలా మంది తీరు మారడం లేదు. కానీ కొందరు మాత్రం అర్థం చేసుకుని వివాహ బంధాన్ని బలోపేతం చేసుకుంటున్నారు.

ఇవి కాకుండా.. భార్యభర్తల విభేదాలతో కొన్ని సందర్భాల్లో పోలీసులు, పెద్దల వద్దకు వెళితే ఎక్కడ తమ పరువు పోతుందోనని..ఎవరికీ చెప్పుకోలేక లోలోన మదనపడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

గ్రామ స్థాయిలో పరిష్కారం



పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

దాంపత్యంలో సమస్యలు వస్తే ఒకప్పుడు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు సచివాలయాల్లో మహిళా పోలీసు వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఈ సదుపాయాన్ని చాలా మంది వినియోగించుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ప్రత్యేకంగా 'హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేసి ఇలాంటి సమస్యలను డీఎస్పీలతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ, ఎస్‌ఐలే కౌన్సిలింగ్ ఇస్తూ దంపతుల మధ్య సయోధ్య కుదుర్చుతున్నారు.

- జిల్లాలో 2022 జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు భార్య భర్తల మధ్య ఘర్షణలు, వరకట్న వేధింపులు, గృహ హింస, ప్రేమ వివాహాలకు సంబంధించి 1,012 మంది దంపతులు ఘర్షణ పడి ఫిర్యాదు చేసుకున్నారు.
- ఇందులో 114 కేసులు నమోదు కాగా, మిగత వారిని కౌన్సిలింగ్ నిర్వహించడంతో ఆ దంపతులు సంసారం సాగిస్తున్నారు.
- 2023 జనవరి, ఫిబ్రవరి(ఇప్పటివరకు)లో వంద మంది దంపతులు ఫిర్యాదు చేయగా, అందులో 5 కేసులు నమోదు చేశారు.

ఒక్కటి చేసేందుకే ప్రయత్నం



ఘర్షణతో తగువుపడి వచ్చే దంపతులను ఒక్కటి చేసేందుకు ప్రయత్నం చేస్తుంటాం. ఘర్షణ పడి వచ్చే దంపతులపై వెంటనే కేసులు నమోదు చేయకుండా ముందుగా కౌన్సిలింగ్ చేస్తున్నాం. అయినా వినకపోతే కేసులు నమోదు చేస్తున్నాం. న్యాయవాదులు, పోలీసులతో ఏర్పడిన కమిటీ ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తుంటాం. ప్రస్తుతం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నియమించిన మహిళా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో 'హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేశాం.

- ఎస్.వాసుదేవ్, డీఎస్పీ, దిశా పోలీస్ స్టేషన్, శ్రీకాకుళం.

రాజీ అవసరం



ఆలు మగల మధ్య నమ్మకం ఎంత బలంగా ఉంటే కాపురం అంత సంతోషంగా ఉంటుంది. ఎంత బలహీనపడితే అంత నరకం అవుతుంది. నమ్మకం ఉన్నచోట అభద్రత ఉండదు, అనుమానాలు ఉండవు, హింస ఉండదు, రహస్యాలు ఉండవు. వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఆత్మవంచనలు ఉండవు. సంసారంలో దంపతులిద్దరి మధ్య భేదాభిప్రాయాలు రావచ్చు. ఒకరిని ఒకరు అర్థం చేసుకొని కొన్ని విషయాల్లో రాజీ పడటం చాలా ఉత్తమమైన మార్గం. న్యాయ వ్యవస్థలో మేము సైతం జంటను ఒక్కటిగా చేసేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తాం. ఆవేశంలో విడిపోయిన జంటలు సైతం కొన్నేళ్ల తరువాత ఒక్కటైన సంఘటనలు కోకొల్లలు.

- దూగాన చిరంజీవులు, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ జడ్జి, సోంపేట

మనసు విప్పి మాట్లాడుకోవాలి



ముందుగా దంపతుల మధ్య సఖ్యత ఉండాలి. అభిప్రాయాలు నిర్మొహమాటంగా వెల్లడించుకోవాలి. ప్రశాంతంగా వ్యవహరించుకోవాలి. ఆరోపణలు, అభియోగ ధోరణి ఉండకూడదు. భాగస్వాముల్లో ఏకపక్ష నిర్ణయాలు, ప్రయత్నాలు ఆశించినంత ఫలితాలు ఇవ్వవు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండకూడదు. అప్పుడే వివాహానికి సరైన అర్థం.

- పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్, శ్రీకాకుళం

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాశివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగంలో ఉత్సవాలను ఘనంగా జరిపించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. శివరాత్రి ఉత్సవాలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జలుమూరు మండలం శ్రీముఖలింగంలో నిర్వహించే పండుగలు అత్యంత వైభవంగా జరిపించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణకు ముందస్తు నిధులను తక్షణమే విడుదల చేశామని, పండగ మరింత బాగా జరిగేందుకు అవసరమైతే మరిన్ని నిధులను మంజూరు చేస్తామని కలెక్టర్ అధికారులకు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జీవీ రవి కుమార్, తహసీల్దార్ బి.సత్యం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై కేసు నమోదు

కొత్తూరు: కొత్తూరు మండలం గులివిందల పేటకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ మెట్టూరు బిట్–3 పునరావాస కాలనీ సర్పంచ్ కె.శ్రీనివాసరావుపై కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇటీవల ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు శనివారం సర్పంచ్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మురపాక గోవింద తెలిపారు. సర్పంచ్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, తనపై దుర్భాషలాడారని, రెండు వర్గాల మధ్య వివాదాలు ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని సూర్యనారాయణ ముందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అడ్డు తొలగించుకునేందుకే..

- వీడిన కోటబొమ్మాళి కలాసీ మర్డర్ మిస్టరీ
- భార్య అక్రమ సంబంధాన్ని ప్రశ్నించినందుకే హత్య
- రెండు రోజుల్లోనే హంతకులను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివరామిరెడ్డి



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరామిరెడ్డి



హత్యకు ఉపయోగించిన కత్తి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి పంచాయతీ మూలపేటలో జరిగిన కలాసీ మట్ట గవరయ్య హత్య కేసును పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. భార్య అక్రమ సంబంధాన్ని ప్రశ్నించినందుకే హత్య జరిగిందని కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం సాయంత్రం కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

మూలపేటకు చెందిన బమ్మిడి ముకుందరావు, మట్ట గవరయ్య స్నేహితులు. ఈ రెండు కుటుంబాల వారు మూడేళ్లుగా కలిసి వ్యవసాయం చేస్తున్నారు. అయితే ముకుందరావుకు గవరయ్య భార్య శ్రీదేవికి పరిచయం ఏర్పడి, అది కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. దీని గురించి తెలుసుకున్న గవరయ్య కొంతకాలంగా తన భార్యను ప్రశ్నిస్తూ వేధించేవాడు. దీంతో గవరయ్యను అడ్డు తొలగించుకోవాలని భావించిన ముకుందరావు దానికి ప్లాన్ వేశాడు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం గవరయ్యకు ఫోన్ చేసి శనగ పంటకు 10 కిలోల యూరియా పొలం వద్దకు తీసుకురావాలని చెప్పాడు. దీంతో గవరయ్య మిల్లులో పని ముగించుకుని రాత్రి 7.30–8 గంటల మధ్య యూరియా పట్టుకుని పొలానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ముకుందరావు పదునైన కత్తితో గవరయ్య తల, కంఠంపై ఏడుసార్లు నరికి చంపేశాడు. గవరయ్య సెల్‌ఫోన్‌ను సమీపంలోని చెరువులో పడేసి కత్తిని ఒక షెడ్డులో దాచేశాడు. అయితే పోలీసులు మృతుడి కాల్ డేటా ఆధారంగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. మృతుని భార్య శ్రీదేవి ప్రోత్సాహంతోనే తాను హత్య చేసినట్లు ముకుందరావు నిజం ఒప్పుకున్నాడు. హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముకుందరావు, శ్రీదేవిలను నరసన్నపేట కోర్టులో హాజరుపరచగా.. కోర్టు వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో వారిని అంపోలు జిల్లా జైలుకు తరలించారు. హత్య కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన టెక్కలి సీఐ సూర్యచంద్ర మౌళి, కోటబొమ్మాళి, టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, నౌపడ ఎస్‌ఐలు షేక్ మహమ్మద్ అలీ, రామకృష్ణ, మధుసూదనరావు, అమీర్ అలీ, లావణ్య, సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని డీఎస్పీ తెలిపారు.

జగదోద్ధార..సుందరాకార



వాసుదేవునికి అభిషేకం చేస్తున్న దృశ్యం



అలంకృతుడైన వాసుదేవుడు

మందసలో బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం స్వామికి అభిషేక మహోత్సవం నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించారు. – మందస

9719 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లలో సివిల్ కేసులు 105, క్రిమినల్ కేసులు 9463, ప్రీ లిటిగేషన్ కేసులు 151 కలిసి 9719 కేసులు పరిష్కరించారు. వీటిలో అధిక శాతం పెండింగ్ కేసులే. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణతో పాటు ఆమదాలవలస, నరసన్నపేట, కోటబొమ్మాళి, పలాస, పాలకొండ, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, పొందూరు, కొత్తూరు, ఇచ్ఛాపురం కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో అన్ని బెంచీల పనితీరును జిల్లా ప్రధాన న్యాయమూర్తి పర్యవేక్షించారు. బీమా కంపెనీలు, జిల్లా కోర్టులోని మేటర్లకు లోక్ అదాలత్ ప్రిసైడింగ్ ఆఫీసరుగా శ్రీకాకుళం జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి తిరుమల వెంకటేశ్వర్లు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులోని కేసు రాజీ చేసేందుకు ప్రిసైడింగ్ ఆఫీసరుగా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ అనురాధ, మెజిస్ట్రేట్ కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహించడానికి న్యాయమూర్తులు లక్ష్మీ భరణి, రాణి ప్రిసైడింగ్ ఆఫీసర్స్‌గా పాల్గొన్నారు.

క్లుప్తంగా

బలవంతపు ఓటీలు రద్దు చేయాలి



శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ జేఏసీ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో పెంచిన పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ ఏడు రోజులుగా నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోని యాజమాన్య తీరుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నట్లు జేఏసీ నాయకులు కె.గణేష్, జి.త్రినాథ్, కె.దశరథ్, కె.బాబూరావు, పి.నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శనివారం కూడా రిలే నిరాహారదీక్ష కొనసాగించారు. శ్రీకాకుళం 1, 2 డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపోల్లోనూ శనివారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన, ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విలీనం చేస్తే.. యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తోందని ధ్వజమెత్తారు. 13గంటల పనివిధానం రద్దు చేయాలని, ఓటీ అలవెన్స్‌లు చెల్లించాలని, బలవంతపు ఓటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా శ్రీకాకుళం రెండో డిపోలోని ఓటీలన్నీ సింగిల్ డ్యూటీలుగా మార్చి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. నిరాహార దీక్షలో జేఏసీ ప్రతినిధులు కె.సూర్యప్రకాశరావు, ఆర్.మల్లేశ్వరరావు, ఎ.వి.ఆర్.మూర్తి, కె.రామప్పడు, పి.గంగారావు, జి.మణిమాల, ఆర్.తారకేశ్వరరావు, జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

టెక్కలి రూరల్: టెక్కలి పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 13న వేలం నిర్వహించనున్నట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఒక టాటా మ్యాజిక్, 4 ద్విచక్ర వాహనాలకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలం పాట ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని కోరారు.

ఉత్సాహం ఉరకలు.. జోరుగా పరుగులు

- 'సాక్షి'ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ స్థాయి పోటీలు ప్రారంభం
- జూనియర్స్, సీనియర్స్ విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత

విశాఖ స్పోర్ట్స్: 'సాక్షి' ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ ప్రాంతీయ స్థాయి పోటీలు శనివారం విశాఖపట్నంలోని ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు ఈ టోర్నీలో పోటీపడ్డాయి. 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించేందుకు ఆదివారం సీనియర్స్ విభాగంలో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టుతో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తలపడనుంది. జూనియర్స్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టుతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టు పోటీ పడనుంది.



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, శ్రీకాకుళం

అర్ధసెంచరీ తేడాతో..

సీనియర్స్ విభాగం రెండో మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు నాలుగు వికెట్లకు 121 పరుగులు చేసింది. సాయి యశ్వంత్(60) ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ చేయగా షరోన్ 45 పరుగులు చేశాడు. రవి కుమార్, వంశీ చెరో వికెట్ తీశారు. ప్రతిగా ఐడియల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(కాకినాడ) జట్టు మూడు వికెట్లు కోల్పోయి 70 పరుగులే చేసి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సూర్య చైతన్య 41 పరుగులు చేశాడు. యశ్వంత్ రెండు వికెట్లు తీశాడు.



అర్ధ సెంచరీ చేసిన సాయి యశ్వంత్

హోరాహోరీ పోరులో..

జూనియర్స్ తొలి మ్యాచ్‌లో సాయి గణపతి పాలిటెక్నిక్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లకు 84 పరుగులు చేసింది. నూకేష్(56) ఎనిమిది ఫోర్లతో అర్ధ సెంచరీ చేశాడు. సతీష్, గౌతమ్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా ఆర్‌కే జూనియర్ కళాశాల(పార్వతీపురం) జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేయగలిగింది. చిరంజీవి 33, సంజయ్ 23 పరుగులు చేశారు. తేజ, లోకేష్ చెరో వికెట్ తీశారు.



సాయిగణపతి పాలిటెక్నిక్, విశాఖపట్నం

ఐదు వికెట్ల తేడాతో..



ఎంవీజీఆర్ కళాశాల, విజయనగరం

సీనియర్స్ విభాగంలో జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ ఓడిన ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల(శొంఠ్యాం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి75 పరుగులు చేసింది. ఓపెనర్ సునీల్ 39 పరుగులు చేశాడు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు(విజయనగరం) రెండు వికెట్లు కోల్పోయి 8.1 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ రవికుమార్ 38 పరుగులతో నిలిచాడు.

లక్ష్యసాధనలో..



శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, తూర్పుగోదావరి

జూనియర్స్ రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల(పలాస) ఐదు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. సాయికృష్ణ 45 పరుగులు చేశాడు. చరణ్‌సాయి రెండు, యశస్వి ఓ వికెట్ తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ కళాశాల(పెద్దాపురం) జట్టు ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ సూర్య దిలీప్ 47 పరుగులు చేశాడు. వాసు, యుగంధర్ చెరో వికెట్ తీశారు.

అధునాతన ఆస్పత్రిగా జొన్నవలస సీహెచ్‌సీ



ఆస్పత్రి భవవ నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే ధ్యేయం
- శాసన సభాపతి తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: జొన్నవలస సీహెచ్‌సీ(30 పడకల ఆస్పత్రి)ని అధునాతన సౌకర్యాలతో ఆమదాలవలస ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. దీనిలో భాగంగా వంశధార కార్యాలయం ఆవరణలోకి ఆస్పత్రిని మార్చేందుకు భవనాలను సంసిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆస్పత్రి భవన పనులను పరిశీలించారు. అనంతరం స్పీకర్ క్యాంపు కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకు ఆహ్లాదకర వాతావరణం అందేలా భవన నిర్మాణాలు ఉండాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రతలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. బహిరంగ వేదిక, మదర్ థెరిస్సా, నైటింగేల్ విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి అనుమతులతో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ పి.శ్రీనివాసరావు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జె.జె.మోహన్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.శ్యాంప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, డి.చిరంజీవిరావు, జె.కె.వెంకుబాబు, పార్టీ నాయకులు మామిడి రమేష్, చిన్నారావు, మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు, కూన రామకృష్ణ, వైద్యశాఖ ఉన్నతాధికారులు, వంశధార అధికారులు పాల్గొన్నారు.

కష్టజీవుల నిజాయితీ

హిరమండలం: కొత్తూరు గ్రామానికి చెందిన ఎం.రమేష్‌బాబు కో-ఆపరేటివ్ ఎడ్యుకేషన్ అధికారిగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి పాతపట్నం మీదుగా రుగడ, కొమనాపల్లి, కొత్తూరు వెళ్తుండగా మార్గమధ్యలో డ్యూటీ బ్యాగ్ పోగొట్టుకున్నారు. నివగాం వద్దకు వెళ్లేసరికి బ్యాగు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. కొమనాపల్లిలో రహదారి పక్కన భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు బ్యాగు దొరకడంతో భద్రపరిచారు. బ్యాగులో సుమారు రూ.70 వేలు నగదు, రూ.24 వేల చెక్కులు, విలువైన పేపర్లు ఉన్నాయి. స్థానికులు బ్యాగులోని చెక్కుబుక్‌పై ఉన్న మొబైల్ నెంబర్ ద్వారా రమేష్‌బాబుకు తెలియజేసి బ్యాగు అప్పగించారు. కష్టజీవుల నిజాయితీని పలువురు అభినందించారు.



రమేష్‌బాబుకు బ్యాగు అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు


రాజకీయ పార్టీలు ప్రజాసేవకు వేదికలు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- వైఎస్సార్ సీపీలో 65 మంది వ్యాపారుల చేరిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నీతి నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఉన్న వారే రాజకీయ పార్టీలో చేరుతారని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో బరాటం సంతోష్ నేతృత్వంలో 65 మంది వ్యాపారులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. టౌన్‌హాల్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారందరికీ మంత్రి ధర్మాన కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రక్తదానం, అన్నదానం, వస్త్రదానాలు వంటి సేవా కార్యక్రమాలు చురుగ్గా చేపడుతున్న సంతోష్ వంటి వారు పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. కళింగ కోమట్లను బీసీలో చేర్చేందుకు కమిషన్‌కు తానే సిఫారసు చేశానని గుర్తు చేశారు. అయినప్పటికి కొంతమంది తమకు వ్యతిరేకంగా ప్రచారం చేశారన్నారు. గత ఎన్నికల్లో ఓటు వేయలేదని, అయినప్పటికీ కళింగ కోమట్లను బీసీల్లో చేర్చే విషయమై ప్రయత్నం మానలేదన్నారు. కమిషన్‌కు రికమండేషన్ తర్వాత క్యాబినేట్ ఆమోదించి రిజర్వేషన్ కల్పించింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇటువంటి విషయాలను మీ కుల సంఘ పెద్దలు చెప్పాలన్నారు. తనను బలపరచమని, ఓటియ్యమని అడగడం లేదని.. అబద్ధపు ప్రచారాన్ని మాత్రం అడ్డుకోమని చెబుతున్నానని మంత్రి స్పష్టం చేశారు. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక అసమానతలు తగ్గించడమే ధ్యేయం..

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తూ పలు పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి ధర్మాన చెప్పారు. దానిని విమర్శిస్తూ ప్రతిపక్ష నాయకులు సైకో అని విమర్శలు చేయడం దారుణమన్నారు. లంచాలకు తావు లేకుండా మూడున్నరేళ్లుగా పాలన సాగిస్తున్నామన్నారు. పథకాల కోసం ఎవరినీ బతిమాలే పనిలేకుండా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తన గెలుపోటములు ముఖ్యం కాదని, సమాజంలో వచ్చే మార్పులు మాత్రం పాలకుల వల్ల వస్తాయన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సంతోష్ విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. కార్యక్రమంలో కళింగ వైశ్య, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి శ్రీనివాసరావు, ఎం.వి.స్వరూప్, డాక్టర్ దానేటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, శిమ్మ రాజశేఖర్, ఎన్ని ధనుంజయరావు, కొణార్క్ శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసరావు, ఊన్న నాగరాజు, మండవిల్లి రవి, అంధవరపు సంతోష్, ప్రసాద్, పొన్నాడ రుషి, ఆలుగుబెల్లి నాగభూషణరావు, పాలిసెట్టి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి కండువాలు వేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మా మావయ్య అనాథ కాదు

- టీడీపీ నేతలు రాజకీయం చేయడం తగదు
- సవర బారికి మేనల్లుడు కైలాష్

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం పంచాయతీ మామిడిగుడ్డి గ్రామానికి చెందిన సవరబారికి అనే వృద్ధుడి మరణంపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేసిన విషయం విదితమే. తన మావయ్య మరణాన్ని వక్రీకరిస్తూ రాజకీయం చేయవద్దని అతని మేనల్లుడు సవర కైలాష్ అన్నారు. సుమారు 15 ఏళ్లుగా అతను మంచానికే పరిమితమైతే తాను, తన భార్య సేవచేస్తూ కన్న తండ్రిలా చూసుకున్నామని చెప్పారు. ఐరిష్, వేలిముద్రలు పడకపోవడంతో కొద్దిరోజులుగా పెన్షన్ రాలేదని, అయినా రేషన్ వస్తోందని తెలిపారు. నడవలేని ఆయన పరిస్థితిని చూసి ఇటీవల ఎమ్మెల్యే రెడ్డిశాంతి అనాథాశ్రమంలో చేర్పుతామని, వృద్ధునికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారని, అయినప్పటికీ తామే సంరక్షణా బాధ్యతలు చూసుకున్నామని తెలిపారు. అంత్యక్రియలు కూడా చందాలు వేసి చేశామని వక్రీకరించడం బాధాకరమని కన్నీటి పర్యంతమయ్యారు. ఓ వైపు విషాదంలో తాముంటే దాన్ని రాజకీయం చేసి మరింత బాధిస్తున్నారని వాపోయారు. కుటుంబం ఉండగా ఆకలి కేకలతో ఎలా మరణిస్తాడని ప్రశ్నించారు. అమాయక గిరిజనులతో రాజకీయాలు చేయవద్దని గ్రామస్తులు తెలిపారు. కాగా, వృద్ధుని కుటుంబాన్ని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం పరామర్శించారు.



బారికి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కథా నిలయం స్ఫూర్తితో 'కవితా నిలయం'



కవితా నిలయం నూతన కార్యవర్గం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో నూతన సాహితీ సంస్థ 'కవితా నిలయం' ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. రచయిత జె.శరత్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కవితా నిలయం అధ్యక్షునిగా కళాశాల డైరెక్టర్ సురంగి మోహనరావు, ప్రధాన కార్యదర్శులుగా కవి మహ్మద్ రఫీ(ఈ వేమన), భోగిల ఉమామహేశ్వరరావులనుఎన్నుకున్నారు. కార్యదర్శులుగా కె.వి.రాజారావు, సంతోష్‌కుమార్, మహిళా కార్యదర్శిగా తేజస్విని, కోశాధికారిగా ఉదయ్‌కిరణ్, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మీ, సలహాదారులుగా శరత్‌బాబు, గోపాలరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఈవేమన మాట్లాడుతూ కథానిలయం స్ఫూర్తితో కవితానిలయం ఏర్పాటు చేశామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కవులు రచించిన కవితా సంపుటాలను సేకరించి భద్రపరచడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ప్రతి నెలా మూడో ఆదివారం కవుల రచనలపై సమీక్ష, కవిసమ్మేళనం కళాశాలలో నిర్వహిస్తామని చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని పీఎన్‌కాలనీలో శనివారం పేకాట ఆడుతూ ఐదుగురు జూదరులు పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.11,580 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	54,930-00
బంగారం(22కె. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185